బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

కుట్రలను తిప్పికొట్టు-అభివృద్ధికి పట్టం కట్టు

తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో తొంభై శాతం హామీలు పూర్తయ్యాయి. మిగిలిన హామీలు దశలవారీగా పూర్తి కానున్నాయి. అవినీతికి తావులేకుండా కేసీఆర్ ఆలోచనా విధానాలతో అధికారుల సహకారంతో తెలంగాణ రాష్ట్రం దేశంలో అభివృద్ధి, సంక్షేమంలో అగ్రభాగాన నిలిచింది. కులమతాలకతీతంగా పేద, ధనిక తేడాలు లేకుండా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజలందరికీ చేరువయ్యాయి. ప్రధానంగా కాంగ్రెస్, తెలుగుదేశం పాలనలో పల్లెలన్నీ వల్లకాడులయ్యాయి. కులవృత్తులను నమ్ముకొని బతుకీడ్చినవారు అవి కనుమరుగవటంతో బతుకడమే కష్టమై పల్లెలనిడిచి వలసపోయిన సందర్భాలున్నాయి. కానీ, తెలంగాణ ప్రభుత్వం అంతరించిపోయిన కులవృత్తులను ప్రోత్సహించడంతో పాటు, వ్యవసాయరంగ అనుబంధ రంగాలను మరింత బలోపేతం చేసింది.

తెలంగాణ వచ్చాక వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రధానమైన గొర్రెలు, మేకల పెంపకం, పాడి పరిశ్రమలను ప్రోత్సహించి ఈ రంగాలపై ఆధారపడిన వారికి భవిష్యత్తుపై భరోసా కల్పించారు సీఎం కేసీఆర్. మిషన్ కాకతీయతో జలసందడి చేస్తున్న చెరువుల్లో చేప పిల్లలను పెంచి మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తున్నారు. సబ్సిడీ బర్రెల పథకాన్ని ప్రకటించి గ్రామీణ ఉపాధి రంగాన్ని బలోపేతం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ప్రతి ఎకరానికి ఏటా రూ.10 వేలు పెట్టుబడి సాయం అందిస్తున్నది. దశలవారీగా ప్రభుత్వం లక్ష్యాలను అధిగమిస్తూ పేద ప్రజలను, అణగారిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు నడిపించేందుకు ఎంచుకున్న లక్ష్యాల్లో ఒక్కొక్కటిగా అధిగమిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ కార్యక్రమం మొదలుపెట్టినా అది భవిష్యత్తు తరాల కోసమే అనేవిధంగా నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యమంలో కీలక భాగస్వామ్యం పంచుకున్న ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చి, పరిపక్వత చెందిన పాలనాధినేతగా పేరు తెచ్చుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమరంగాలను ప్రక్షాళన చేసి పురోగతికి చర్యలు తీసుకున్నారు కేసీఆర్. ప్రజల పరిపాలనా సౌలభ్యం కోసం 10 జిల్లాలను 33 జిల్లాలుగా ఏర్పాటుచేసి సమాన అభివృద్ధి ఫలాలను సాధించేందుకు కార్యాచరణ ప్రణాళికలు అమలుచేస్తుంది రాష్ట్ర ప్రభుత్వం.

రాష్ట్రంలో ఉన్న కోటి మూడు లక్షల కుటుంబాల్లో నూతన వెలుగులు నింపాలన్న సంకల్పంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా సామాజిక సర్వే ఆధారంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వర్తింపజేస్తున్నాయి. రాష్ట్రంలో సుమారు 93 లక్షల కుటుంబాల్లో ఉన్న పేదలను గుర్తించి వారి ఆర్థికాభివృద్ధికి సరికొత్త పథకాలు ప్రారంభించింది ప్రభుత్వం. అన్ని సంక్షేమ పథకాల్లో నిబంధనలు సడలించి సాధ్యమైనంత మేర ఎక్కువ మంది లబ్ధి పొందేలా వారికి న్యాయం చేసింది ప్రభుత్వం. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు గుర్తింపులేని అనేక కులాలను గుర్తించి వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసింది. అవినీతి అక్రమాలకు దూరంగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు నేరుగా చేరవేయాలన్న సంకల్పంతో అనర్హులను తొలగించి, అసలైన అర్హులకు మేలు చేసింది. పరిమితి లేకుండా పేద కుటుంబాల్లోని ప్రతి వ్యక్తికి ఆరు కిలోల చొప్పున రేషన్ బియ్యం అందిస్తున్నది. దారిద్య్రరేఖకు దిగువగా ఉన్న కుటుంబాలను గుర్తించి వారికి ఆహారభద్రత కల్పించేందుకు ఆధార్ కార్డు లింకేజీతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిం ది. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి డిజిటల్ రేషన్ కార్డులను మంజూరు చేసేవిధంగా చర్యలు చేపట్టింది. బయోమెట్రిక్ విధానం ద్వారా సరుకులను సరఫరా చేస్తుంది. ప్రభుత్వం ఈ విధానం ద్వారా బ్లాక్ మార్కెట్‌ను దాదాపు 90 శాతం అరికట్టకలిగింది.

వంట కోసం కిరోసిన్‌ను వాడని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని భావించిన ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లను పెంచేందుకు నిర్ణయించింది. ఉమ్మడి రాష్ట్రంలో 19.84 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం కొత్తగా 9.37 లక్షల మందికి కనెక్షన్లు మంజూరయ్యేలా చేసింది. మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తూ మహిళా పోలీసులతో 'షీ' టీమ్‌లను ఏర్పాటుచేసింది. మహిళల పట్ల జరిగే అఘాయిత్యాలను అరికట్టగలిగింది.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తూ పేద విద్యార్థులకు బాసటగా నిలిచించి. రైతు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా రైతుల రుణమాఫీ చేసి వారి అప్పులను తీర్చింది. దురదృష్టవశాత్తు రైతు చనిపోతే ఆ రైతు కుటుంబాలకు రైతు బీమా ద్వారా ఐదు లక్షల రూపాయాల నష్టపరిహారాన్ని చెల్లిస్తుంది. వ్యవసా య ఉత్పత్తుల నిలువకు కొత్తగా మూడువందలకు పైగా గోదాములను నిర్మించే కార్యక్రమానికి శ్రీకా రం చుట్టింది. ప్రభుత్వం రాజధానిలో ప్రవేశపెట్టిన ఐదు రూపాయల భోజన పథకాన్ని వ్యవసాయ మార్కెట్లో ప్రవేశపెట్టి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. అన్నింటికీ మించి దళిత నిరుపేదలకు మూడెకరాల భూ పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్నది. అంతేకాకుండా ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా దళితులు ఆర్థికంగా ఎదగడానికి ప్రభు త్వం దళితబంధు పథకం ద్వారా పది లక్షల ఆర్థిక సహాయాన్ని అందించి, వారి ఇంట్లో వెలుగులు నింపుతున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా అనేక గురుకుల పాఠశాలలను కొత్తగా ప్రారంభించింది. అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు రూ.20 లక్షలరుణ సదుపాయాన్ని అందజేస్తుంది.

అణగారిన వర్గాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పరిశ్రమల ద్వారా ప్రత్యేకంగా 50 శాతం వరకు పెట్టుబడి రాయితీలను అందిస్తున్నది. న్యాయవాదుల అభివృద్ధి, సంక్షేమం కోసం వందకోట్లు కేటాయించింది. డ్రైవర్లు, హోంగార్డులు, జర్నలిస్టులకు ఐదు లక్షల ప్రమాద బీమా పథకాన్ని ప్రారంభించింది. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ప్రమాద బీమా కింద ఉన్న పథకాన్ని రెండు నుంచి ఐదు లక్షల రూపాయల వరకు పెంచింది.

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఎంచుకున్న మిషన్ భగీరథ పథకం లక్ష్యాన్ని ఛేదించింది. గడువులోగా పనులన్నీ పూర్తిచేసి 100 శాతం మంచి నీటిని అందించే రాష్ట్రంగా గుర్తించబడింది. రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే తపనతో ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. పుట్టిన బిడ్డకు 16 రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్‌ను అందిస్తున్నది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో పోషకాహారాన్ని అందిస్తుంది ప్రభుత్వం. ప్రభుత్వం అంగన్వాడీ సిబ్బందికీ జీతాలు పెంచింది. అలాగే ఆశా వర్కర్ల పారితోషికాన్ని కూడా పెంచింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా చేసింది.

ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా 4,380 గ్రామపంచాయితీలు ఏర్పాటయ్యాయి. విద్యుత్తు రంగంలో తెలంగాణ రాష్ట్రం జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొం దింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరందించింది. తద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు, గతంలో కంటే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వరి దిగుబడిలో నేడు తెలంగాణ దేశం గర్వించే స్థాయిలో నిలిచిం ది. రైతులు పంటలు పండించి సంతోషంగా ఉన్నారంటే అది కేసీఆర్ సంకల్పమే.

రాష్ట్రంలో 24 గంటల విద్యుత్తు కారణంగా ఈనాడు అనేకవర్గాల ప్రజలు వెలుగుదారుల్లో పయనిస్తున్నారు. ఇలా అనేక వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు మరొకసారి ఆదరించాల్సిన అవసరం ఉన్నది. లేనట్లయితే ప్రజా సంక్షేమం కుంటుపడే ప్రమాదం ఉన్నది. ప్రధానంగా తెలంగాణ జలవనరులు, మన ప్రాంతానికి దక్కకుం డా పోయే ప్రమాదమూ ఉన్నది. ఎందుకంటే పచ్చ గా ఉన్న తెలంగాణను వల్లకాడుగా చేయడానికి ప్రతిపక్ష పార్టీలు కూటమి కట్టాయి. ఆ కూటమిలో ప్రజా సంక్షేమం కంటే సొంత స్వార్థమే ఎక్కువగా కనబడుతున్నది. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి. ప్రజా ప్రభుత్వానికి బాసటగా నిలువాలి.

మోటె చిరంజీవి
99491 94327

సాధించాల్సింది ఎంతో ఉంది

2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటిసారి అధికారంలోకి వచ్చి తనదైన శైలిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. అదే విధంగా రెండవసారి 2018లో కూడా అధికారంలోకి వచ్చి పదేండ్లు పూర్తిచేసుకున్న ప్రభుత్వం నేడు అతి ముఖ్యమైన ఎన్నికల సమరంలో తలపడుతున్నది. ఈ పదేండ్ల అభివృద్ధిలో దేశంలోనే వివిధ రాష్ట్రాలతో పోటీపడుతూ తనదైన శైలిలో తెలంగాణ మాడల్‌ను దేశానికి పరిచయం చేశారు ముఖ్యమంత్రి కేసీఆర్. ఈ ఎన్నికల్లో కూడా 'సాధించింది చాలా ఉంది. కానీ మనం సాధించాల్సింది ఇంకా ఉంది' అనే నినాదంతో బీఆర్ఎస్ పార్టీ నేడు ఎన్నికల సంగ్రామంలో ప్రచారం కొనసాగిస్తున్నది.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పదేండ్లలో పలురంగాల్లో సరికొత్త నూతన పథకాలు, విధానాలను ప్రవేశపెట్టి తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపింది. ఈ పదేండ్లలో రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాలకు సాగునీరు, పరిశ్రమలకు, గృహాలకు పంటలకు 24 గంటల కరెంటు, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ సురక్షిత మంచి నీరు అందించింది. మైనారిటీల సంక్షేమం, తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రస్థానం, పెట్టుబడులకు ఒక గమ్యస్థానంగా తెలంగాణ మారింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సామాజిక భద్రతలో భాగంగా వృద్ధులకు, వికలాంగులకు పింఛన్ అందించింది. దేశానికే ధాన్యాగారంగా మన తెలంగాణ మారడానికి రైతుబంధు, రైతుబీమాలతో రైతు కుటుంబాలకు భరోసానిచ్చింది. రుణమాఫీ, విస్తరించినటువంటి వైద్య సదుపాయాలు, వైద్య విద్య, గర్భిణులకు, బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం, కంటి వెలుగు, మిషన్ కాకతీయ వంటివెన్నో అమలు చేసింది.

హైదరాబాద్ దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైనటువంటి విశ్వనగరంగా మారింది. రాష్ట్రాన్ని పచ్చదనంతో విరజిల్లేలా హరితహారాన్ని రూపొందించింది. ఇలా అనేకమైనటువంటి పథకాలను, విధానాలను, కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. ఈ పదేండ్లలో చేసినటువంటి పనులు దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టాయి. ఇదే అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీబీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం గట్టాల్సిన అవసరం ఉన్నది.

మూడోసారి అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ ఏం చేయాలి? అనేటువంటి ఒక నిర్దిష్టమైనటువంటి లక్ష్యాలను కూడా కలిగి ఉన్నది. తెలంగాణను దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఒక అభివృద్ధి చెందినటువంటి రాష్ట్రంగా చూపెట్టాలని ఒక ఉన్నతమైనటువంటి లక్ష్యాన్ని కలిగి ఉన్నటువంటి పార్టీ బీఆర్ఎస్. అదేవిధంగా ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి, తలసరి ఆదాయంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపటం, యువతకు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవడానికి హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యంత ఆమోదయోగ్యమైన నగరంగా మార్చడానికి ప్రభుత్వం కృషిచేస్తున్నది. తెలంగాణను ప్రపంచంలోనే పెట్టుబడుల రాష్ట్రంగా మార్చడానికి ప్రపంచ టాప్ 500 పరిశ్రమలను హైదరాబాద్‌లో ఏర్పాటుచేయడం, ప్రపంచ సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని మార్చడానికి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాల్సి ఉన్నది. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడానికి మాత్రమే అధికారం తిరిగి ఇవ్వాలని కోరుతున్నది. కనుక బీఆర్ఎస్‌ను గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

డాక్టర్ శ్రవణ్ కుమార్ కందగట్ల
86393 74879

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్నా కొద్దీ కాంగ్రెస్ నాయకులు ప్రజలను రెచ్చగొట్టే రీతిలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించటం తీవ్ర అభ్యంతరకరం. ఆయా పార్టీల నాయకులు వారి స్థాయిని మించి వ్యక్తిగత ధూషణలకు దిగుతున్నారు. మేం అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ రద్దుచేస్తామని ఒకరు, రైతుబంధు నిలిపివేస్తామని మరొకరు, ప్రాజెక్టులు అవసరం లేవని ఒకరు, జైలుకు పంపిస్తామని ఒకరు విద్వేష ప్రచారాలు చేస్తున్నారు. వారి ప్రచారశైలి చూస్తే ప్రచారం ఏ స్థాయికి దిగజారిందో అర్థం అవుతున్నది.

దిగజారుడు ప్రచారాలు మానండి

'బక్క'మనిషిని ఓడించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ కూటమి కడుతున్నాయి. 2జీ స్కాం, నేషనల్ హెరాల్డ్, కోల్ స్కాం, బోఫోర్స్ లాంటి అవినీతి కేసుల్లో పీకలదాక కూరుకుపోయిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అవినీతిని అంతం చేస్తాం, అవినీతిపరులను శిక్షిస్తామంటూ పరుష పదజాలంతో కేసీఆర్‌ను వ్యక్తిగతంగా విమర్శించటం విడ్డూరంగా ఉన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు తెచ్చుకోవడానికి ప్రజలను రెచ్చగొట్టే వ్యూహాన్ని కాంగ్రెస్ బుద్ధిపూర్వకంగా ఎంచుకున్నట్టు కన్పిస్తున్నది. ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్సే, రేవంత్ సీఎం అంటూ, కాదు నేనంటూ కోమటిరెడ్డి, లేదు దళితుడే ముఖ్యమంత్రి అంటూ భట్టి కాకిలెక్కలు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. డిసెంబర్ 9న బీఆర్ఎస్‌ను గద్దె దించడం ఖాయమంటూ, ముహూర్తం పెట్టుకున్నారంటే, 'ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు గోవిందం' అన్నట్టుగా ఉన్నది కాంగ్రెస్ నేతల కథాకళి. ఈ విషయంలో కేసీఆర్‌తో సరిపోల్చగల నేత తెలంగాణ కాంగ్రెస్‌లో దివిటీ పెట్టి వెతికినా దొరకడు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలు తెలుపడం నేరం కాదు. ప్రభుత్వ నిర్ణయాలు తమకు నచ్చకపోతే ఏ వర్గమైనా వ్యతిరేకిస్తుంది. వివిధ రూపాలలో శాంతియుత నిరసనలు సాగించటంలో తప్పేమీ లేదు. రాజకీయపక్షాలు ఎన్నికల్లో పరస్పరం పోటీ పడినప్పటికీ అవేమి శత్రుపక్షాలు కాదు. కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్లుగా సుపరిపాలన అందించి ప్రజల మధ్యకు వస్తున్నారు. తాము సాధించింది ఏమిటో చెప్పుకొని ఓట్లు అడగడంలో తప్పులేదు. అదేవిధంగా ప్రతిపక్షాలు అధికార పార్టీ వైఫల్యాలు ఎండగట్టడం ద్వారా, తాము ఏమి చేయదల్చుకున్నామో చెప్పడం ద్వారా ప్రజల మద్దతు చూరగొనడానికి ప్రయత్నించాలె. తెలంగాణలో కాంగ్రెస్ గెలిస్తే ఏం చేస్తుందో చెప్పి నాలుగు ఓట్లు సంపాదించవచ్చు, నిర్మాణాత్మక పద్ధతిలో ప్రచారం సాగించడం వల్ల ప్రజల మనస్సును దోచుకోవచ్చు. అంతేకానీ, ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం ద్వారా గెలవాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరం. 76 ఏండ్ల స్వాతంత్ర్యంలో 55 ఏండ్లు పాలించిన రాజకీయ పక్షంగా ఉండి, తెలంగాణ అభివృద్ధికి ఆటంకంగా మారిన సమైక్యవాదులకు వంతపాడిన కాంగ్రెస్ ఇప్పుడేమో వెలగ బెడుతామని సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నది. ఎన్నికలకు సరిగ్గా 16 రోజులున్నయి. ఈ లోగా అన్నిపక్షాలు ఉద్రిక్తలు పెరగకుండా సంస్కారవంతంగా ప్రచారం సాగించితే తప్ప తెలంగాణ సమాజం మెప్పు పొందలేమనేది తెలియదేమో స్కాంగ్రెస్‌కు. తొమ్మిదేండ్లుగా జరిగిన ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీలో కూడా నిలబడలేదు సరికదా? ఎన్నిక ఏదైనా ఉద్యమనేత కేసీఆర్‌కే ప్రజలు పట్టంగట్టారు. వచ్చే ఎన్నికల్లో కూడా అదే జరుగుతుంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారానికి దూరమై పదేండ్లు కూడా కాలేదు. అప్పుడే వారిలో భరించలేని అధికార విరహవేదన. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అధికారంలోకి రావాలనుకోవడం ప్రజాస్వామ్యంలో తప్పుకాదు. అందుకనుగుణంగా మ్యానిఫెస్టో ఉండాలి. ప్రతిపక్షంలో ఉండి ప్రజలకు ఏం చేశామనే విషయం పట్ల నమ్మకం కలిగించినప్పుడు ప్రజాదరణ పొందడం సహజమే. కానీ, అబద్ధాలతో అందలమెక్కేందుకు కుంటిసాకులు చూపెట్టి అధికారంలోకి వస్తామని ప్రచారం చేసుకోవడం సరికాదు.

ప్రతిపక్ష హోదా కూడా లేని కాంగ్రెస్ నేతల హడావుడి చూస్తుంటే డిసెంబర్ 3 వరకు కూడా ఆగేటట్టులేరు. ఉమ్మడి రాష్ట్రాన్ని 42 ఏండ్ల పాటు పరిపాలించిన కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రోద్యమాన్ని పట్టించుకోని ఫలితంగా ప్రజాగ్రహానికి గురై అధికారానికి దూరమైంది. కాంగ్రెస్ పాలిస్తున్న రాష్ట్రాలలో అస్తవ్యస్తమైన పాలన, సీల్డు కవర్ల ముఖ్యమంత్రుల కొట్లాటలు, ఎవరికివారే యమునా తీరన్న మాదిరిగా పాలన సాగిస్తుండటం చైతన్యవంతమైన తెలంగాణలో చెల్లుబాటు కాదు. జాతీయ నాయకత్వం కారణంగా పూలు అమ్మిన చోట కట్టెలమ్ముకోవాల్సిన దుస్థితి ఎందుకు వచ్చిందో కరుడుగట్టిన కాంగ్రెస్ వాదులు ఆత్మవిమర్శ చేసుకోవాల్సి ఉన్నది. కేవలం అబద్ధాలతో అధికారం చేపట్టాలంటే భౌతిక పరిస్థితులు అనుకూలించాలి. వర్తమాన ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత ఉండాలి. ఇంతకంటే భేష్‌గా పాలన కొనసాగిస్తామనే నమ్మకం కల్గించాలి. తాము అధికారంలో ఉన్న ఇతర రాష్ట్రాలలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పోల్చి చెప్పితే ప్రజల ఆమోదం దొరుకుతుంది. అటువంటిది జాతీయ పార్టీగా ఉండి కేవలం తెలంగాణలోనే అమలు చేస్తామంటే కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు.

ప్రధానంగా 138 ఏండ్ల కాంగ్రెస్‌కు నెహ్రూ, ఇందిర, రాజీవ్, పీవీ తర్వాత ప్రజాకర్షక నాయకత్వం కొరత తీవ్రంగా ఉందని ఆ పార్టీనేతలే అంగీకరిస్తున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా అదే పరిస్థితి. ఉన్న వారిలో డజన్ మంది ముఖ్యమంత్రి అభ్యర్థులు. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే చరిష్మా ఉన్న నాయకుడు ఆ పార్టీలో ఒక్కరు కూడా లేరు. జాతీయ నాయకులు సభలో మాట్లాడితే దాన్ని తెలుగులోకి అనువాదం చేసే తెలంగాణ నాయకుడే కాంగ్రెస్‌లో లేడంటే అతిశయోక్తి కాదు.

'ఆడలేక మద్దెల ఓడు' అన్నట్టుగా అజ్ఞానంతో బీఆర్ఎస్ అభ్యర్థులపై దాడులకు దిగుతున్నారు. ఇటీవల దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యా ప్రయత్నం, నిన్న అచ్చంపేట అభ్యర్థి గువ్వల బాలరాజుపై భౌతికదాడి చూస్తుంటే అధికారం కోసం పాతబస్తీలో చిచ్చుపెట్టిన రోజులు గుర్తుకొస్తున్నాయి. హత్యా రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నట్టుగా వారి తీరు కనిపిస్తున్నది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచా రంలో ప్రత్యర్థులను వ్యక్తిగతంగా దూషించి పదవి స్థాయిని తగ్గించుకుంటున్నారు.

అధికారం కోసం అడ్డదారులపై చూపించిన శ్రద్ధ ప్రజల కండ్లల్లో కనిపించే ఆశలను అధ్యయనం చేయడంలో చూపించి ఉంటే బీజేపీకి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీ ఎదిగేదని ప్రజలు అనుకుంటున్నారు. ఒక్క వ్యక్తిని ఓడించేందుకు ఢిల్లీ, ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న నాయకులు కేసీఆర్‌పై ఎన్ని విమర్శలు చేసినా నమ్మే స్థితిలో తెలంగాణ ప్రజలు లేరు. మళ్లీ అధికారం బీఆర్ఎస్‌దే. ప్రభుత్వం ఏర్పాటు చేసేది కేసీఆరే.

డాక్టర్ సంగని మల్లేశ్వర్
98662 55355

తెలంగాణలో ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి బీఆర్ఎస్ విజయావకాశాలపై మీడియాలో, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన విశ్లేషణలు, సర్వేలు అన్నీ, ఇన్నీ కావు. ఎవరికి వారు కంప్యూటర్ ముందు కూర్చొని తమ మనసులోని భావం, తాము ఏదైనా జరుగాలని కోరుకుంటున్నారో (విష్ ఫుల్ థింకింగ్) ఆ కోరికకు అనుగుణంగా లెక్కలు కట్టి, రాజకీయ సమీకరణాలను గుదిగుచ్చి, ఓ వార్తా కథనాన్ని అల్లుతున్నారు. తాము చెప్పిందే నూరుశాతం జరుగుతుందంటూ నమ్మబలుకుతున్నారు. ఆ వార్తా కథనంపై రోజంతా చర్చ, మర్నాటికి మరో కొత్త పోస్టు, దానిపై విశ్లేషణ. ఇలా ఫోకస్ అంతా సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, ఆ పార్టీ అభ్యర్థులపైనే ఉన్నది.

కేసీఆరే గెలుస్తారు.. ఎందుకంటే?

రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు చాలా టైట్ ఫైట్ నడుస్తున్నదని ఒకాయనంటారు. ఎందుకయ్యా అంటే ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, మార్పు కోరుకుంటున్నారని, ప్రజలంతా గంపగుత్తగా తిరుగుబాటు చేస్తున్నారంటారు. ఇక సందులో సడేమియా అన్నట్టుగా ఫలానా కులానికి టికెట్ రానందున ఈసారి పార్టీకి మద్దతు పలుకడం లేదని, జనసమితి, సీపీఐ, వైఎస్సార్టీపీ మద్దతు కలసివస్తుందని కాకిలెక్కలు చెప్తున్నారు. పైగా నమ్మేందుకు గత ఎన్నికల్లో ఇచ్చిన మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలను నెరవేర్చలేదని, అందువల్లే కేసీఆర్ గెలుపు కష్టసాధ్యమంటూ కుహనా మేధావులు విశ్లేషిస్తున్నారు. అసలు నెరవేర్చని హామీలు ఏంటయ్యా? అంటే పొంతన లేని సమాధానం చెప్పి అక్కడినుంచి పరుగో పరుగంటూ నిష్క్రమిస్తున్నరు.

మేధావులు అనే వర్గీకరణలోకి వచ్చేవారి పరిస్థితే గందరగోళంగా ఉన్నప్పుడు ఇతరులను నిందించటం అవివేకం అవుతుంది. తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా అనేక పథకాలను కేసీఆర్ ప్రభుత్వం అమలుచేస్తున్నది. ప్రపంచం బద్దలయ్యేంత అద్భుతం ఏదైనా జరిగి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారం చేపడితే పథకాలు అమలుకు నోచుకోక ప్రజల జీవితాల్లో మరోసారి అంధకారం ఆవరించటం ఖాయం.

గత నెలరోజులుగా వివిధ సామాజిక మాధ్యమాలలో తెలంగాణ వ్యతిరేక శక్తులన్నీ ఏకమై రకరకాల కథనాలు రాస్తున్నాయి. పోనీ వారి ప్రచారానికి హేతుబద్ధత ఉన్నదా? అంటే ఎంత మాత్రం కనిపించదు. సెఫాలజిస్టులు, ప్రీపోల్, ఎగ్జిట్ పోల్ సర్వేలు చేస్తుంటారు. వారు కొన్ని శాంపిల్స్ తీసుకొని ఒక అంచనాకు వచ్చి ఫలానా కారణంగా అటు, ఇటుగా భ్రమలు కల్పిస్తారు. అప్పటికి తమ అంచనాల్లో ఐదు శాతం మీదికి, కిందికి ఎర్రర్ ఉంటుందని నమ్మ బలుకుతారు. అయితే వారికి తెలియనిది ఏమిటంటే కేసీఆర్ గురించి కానీ, బీఆర్ఎస్ గురించి కానీ అంచనా వేసేటప్పుడు ఈ హేతుబద్ధత గురించి ఆలోచించకపోతే కచ్చితంగా తప్పు చేసినట్టే.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఎన్నిక ఏదైనా ఓటమి తెలియని కేసీఆర్ పనితీరుతో పాటు ఆయా నియోజకవర్గాల్లో పార్టీల బలాబలాలు ఆధారపడుతాయి. తెలంగాణ ప్రజలను మందుతో, మాంసంతో కొనే వాతావరణం దాదాపుగా ఉండదు. అదీగాక మరికొంత ఆ పార్టీతో జరిగిన మేలు వల్ల వచ్చే ఓటు ఉంటుంది. సంప్రదాయ ఓటు బ్యాంకు, ఆయా సామాజికవర్గాల ఓటు కొంత ఉంటుంది. అభ్యర్థి ఇష్టాయిష్టాలు ప్రత్యర్థి ఎంతబలమైనవాడు, వారి చరిత్ర, మంచి, చెడులుంటాయి. పార్టీల అధినాయకత్వం విశ్వసనీయత అన్నది ప్రధానంగా ఉంటుంది. ఆ పార్టీ గతంలో ఏం చేసింది? భవిష్యత్తులో ఏ విధంగా ఉంటుందన్న విషయంలో ప్రజలు స్పష్టమైన అభిప్రాయంతో ఉంటారు. ఇవన్నీ కూడా అభ్యర్థి గెలుపు, ఓటములను నిర్ణయిస్తాయి. పలువురు వితండ విశ్లేషణ చేసినా ఎందుకు గెలువదని మాత్రం ఎక్కడా చెప్పలేక పోయారు. ఎందుకంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, నగర ఆర్థిక వ్యవస్థనూ సమాంతరంగా అభివృద్ధి పట్టాలపైకి ఎక్కించి నడిపించిన నాయకుడు నిస్సందేహంగా కేసీఆరే. రాబోయే ఎన్నికల్లో గెలిచేదీ, నిలిచేది కేసీఆర్. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తమ జీవితాలు మరోమారు అంధకారం కాకుండా తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలి.

కేసీఆర్ నాయకత్వంలో జరిగిన తెలంగాణ ఉద్యమం విజయవంతమై తెలంగాణ కల సాకారమైంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత అనుమానాలు పటాపంచలు చేస్తూ వెలుగుల వైపు పరుగులు తీస్తున్నది. ఉద్యమ సమయంలో ఎగతాళి చేసిన వ్యతిరేక శక్తులతో తెలంగాణ మరోసారి ఆత్మగౌరవ పోరాటం జరుపుతున్నది. ఎన్నికల్లో ఒక పార్టీ గెలవడం, మరో పార్టీ ఓడిపోవడం సాధారణమే. కానీ ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్న ఎన్నికలు అలాంటి సాధారణ ఎన్నికలు కాదు.

పోరాడి సాధించుకున్న తెలంగాణలో రాజకీయ చైతన్యం, సాధించిన అభివృద్ధిని తెలంగాణ ఉద్యమ నాయకత్వం పటిష్ఠం చేసే దిశగా అడుగులు వేస్తున్నది. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన శక్తులన్నీ ఏకమై మరోసారి తెలంగాణను మోసం చేసేందుకు కలిసి కుట్రలు చేస్తున్నాయి. తెలంగాణ సాకారమైనా, ఇప్పటికి ఇది నిజమేనా అనిపించేంత ఆశ్చర్యం. ఇప్పుడు మళ్లీ అవే పాత్రలు వేర్వేరు డైలాగులతో వేర్వేరు వేషాలతో మరోసారి తెలంగాణపై దండయాత్రకు వస్తున్నాయి.

కాంగ్రెస్, బీజేపీ రెండు బక్కపలచని కేసీఆర్‌ను ఓడించడానికి ఒకరు కామారెడ్డి, ఒకరు గజ్వేల్ కేంద్రంగా ఇరువైపులా చక్రం తిప్పుతున్నారు. ఉప్పు, నిప్పు లాగా ఉన్న రెండు పార్టీలు ప్రణాళికా ప్రకారం కలిసి సాగుతున్నాయి. అధికారంలోకి రావడమే లక్ష్యంగా విమర్శలు, రాజకీయ స్వప్రయోజనాలే పరమావధిగా భావించేవారు అవలివైపు నిలిచారు. బీఆర్ఎస్ మాత్రం ఈ తొమ్మిదేండ్లలో ఏం చేశామో చెప్తూ వచ్చే ఐదేండ్లలో ఏం చేస్తామో వివరిస్తున్నది. వీరి మధ్య విజేత ఎవరో తెలంగాణ ప్రజలు తేల్చే సమయం ఆసన్నమైంది. తెలంగాణ ప్రజలు మళ్లీ ఉద్యమ పార్టీకే పట్టం కడుతారనడంలోఎలాంటి సందేహం లేదు.

నల్లా బానేశ్
77024 72947